క్లుప్తంగా

నాగేంద్రస్వామికి కోటి పుష్పార్చన

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలిలోని సుప్రసిద్ధ ఆలయంలోని నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష మంగళవారం కోటి మల్లెలతో పుష్పార్చన నిర్వహించారు. హనుమకొండకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, మట్టెవాడ సీఐ గోపీ దంపతులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

రాజేశ్‌కు డాక్టరేట్



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన తాళ్లపెల్లి రాజేశ్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు పర్యవేక్షణలో సమర్పించిన 'హైబ్రిడ్ క్లస్టరింగ్ అప్రోచ్ ఫర్ టైమ్ సిరీస్ డాటా' సిద్ధాంత గ్రంథానికి జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు జేఎన్‌టీయూ పరీక్షల మూల్యాంకన సంచాలకురాలు డాక్టర్ అరుణకుమారి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజేశ్ హైదరాబాద్‌లోని జి.నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజేశ్ సమర్పించిన పలు పరిశోధన పత్రాలు వివిధ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి.

కమిటీ ఎన్నిక

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నపాక శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా నక్క రాజు, కార్యదర్శిగా బుర్కి రవికుమార్, కోశాధికారిగా యాసరపు సురేశ్, దాసరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడారు. గ్రామ అభివృద్ధిలో సంఘం కృషి ఉంటుందని చెప్పారు. సంఘం అభివృద్ధికి, అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడతామని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

గీసుకొండ : వరంగల్‌లోని క్రిస్టియన్ కాలనీ సమీపంలోని తెలంగాణ జంక్షన్ వద్ద ఆగస్టు 6న ప్రజాయుద్ధ నౌక గద్దర్, ఉర్దూ దినపత్రిక ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్, తదితరుల యాది సభకు సంబంధించిన కరపత్రాలను గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్యమకారుడు కొమ్ముల సురేందర్, సామాజిక ప్రజాకవులు, కళాకారుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శరత్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నేతి (బుల్లెట్) వెంకన్న మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేందర్, శరత్, వెంకన్న మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

2న ప్రవేశ పరీక్ష

నెక్కొండ : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో 6 నుంచి 8వ తరగతుల వరకు వివిధ కేటగిరీల్లో ఉన్న ఖాళీల భర్తీ కోసం ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 3, 8వ తరగతిలో 5 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఆగస్టు 1న సాయంత్రం 4 గంటలలోపు పాఠశాలలో దరఖాస్తు అందజేయాలన్నారు.

కొత్త సభ్యులకు రుణాలు ఇవ్వాలి

చెన్నారావుపేట : సహకార సంఘంలో కొత్తగా చేరిన సభ్యులకు వెంటనే రుణాలు ఇవ్వాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. అనంతరం అశోక్ మాట్లాడారు. స్థానిక సొసైటీలో 2012-13 ఆర్థిక సంవత్సరంలో 3786 మంది రైతులు కొత్తగా సభ్యత్వం తీసుకున్నారని చెప్పారు. 2012 నుంచి సభ్యత్వం కలిగిన రైతులకు రుణాలు ఇవ్వకపోవడంతో రుణమాఫీ వర్తించకుండా నష్టం జరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. సభ్యత్వం కలిగిన అందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సంపేటలోని ద్వారకపేటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన నాగమల్ల రమేశ్ భార్య స్వాతి (35) భర్తకు అప్పులు కావడంతో మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. భోజనం చేసేందుకు వచ్చిన భర్త స్వాతి ఉరేసుకుని ఉండడాన్ని గుర్తించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమణమూర్తి తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆశవర్కర్ల అరెస్ట్, విడుదల

ఖానాపురం : నిరసన తెలిపేందుకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆశవర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి తదనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు మాట్లాడారు. ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు
- అక్రమ అరెస్టులపై ఆగ్రహం



శాయంపేట : నిరసన తెలుపుతున్న పంచాయతీ సిబ్బంది



ఐనవోలు : అరెస్టయిన జీపీ కార్మికులు



వేలేరు : అరెస్టయిన ఆశ వర్కర్లు



కమలాపూర్ : అరెస్టయిన సమగ్ర శిక్ష ఉద్యోగులు, నాయకులు

పంచాయతీ ఉద్యోగుల అరెస్టు

శాయంపేట : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంబర్తి రాజు అన్నారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల ఛలో అసెంబ్లీ ముట్టడికి సన్నద్ధం అవుతున్న తమను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా మంగళవారం శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. వేతనాలు పెంచి, ప్రభుత్వ గ్రాంట్ నుంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది బాసని రమేశ్, మారేపల్లి మోహన్, దైనంపల్లి మహిపాల్, కుసుంబ రాజు, సాంబయ్య, దైవ చిత్తం, సూర్యప్రకాశ్, జయపాల్, విమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : గ్రామపంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడం దారుణమని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ పిలుపులో భాగంగా హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్తున్న జీపీ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాడే కార్మికులపై ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో జీపీ వర్కర్స్ కొత్తూరి ఏసెబు, చంద్రయ్య, రవి, గట్టయ్య, మల్లేశ్, కొమురమ్మ, రజిత, పూల, రేణుక, బాబు, కొమురయ్య ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల అరెస్టు

కమలాపూర్ : తమను రెగ్యులరైజ్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష తెలంగాణ ఉద్యోగులు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న క్రమంలో స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. కమలాపూర్ మండలానికి చెందిన ఆరుగురిని మంగళవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. సీఆర్‌పీ అమృత సుభాష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి జక్కు రాజుగౌడ్, గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు ఇసంపెల్లి ఐలయ్య, ఎంఐఎస్‌సీఓ నగునూరి నాగేంద్రబాబు, కేజీబీవీ ఎస్ఓ సీహెచ్.అర్చన, బయోసైన్స్ సీఆర్టీ జి.సాయిలత తదితరులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

ఆశ వర్కర్ల అరెస్టు

వేలేరు (ధర్మసాగర్) : సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న ఆశ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం మహిళలు అని చూడకుండా అర్ధరాత్రి అరెస్టు చేయించడం హేయమైన చర్యన్నారు. హక్కుల కోసం పోరాడే మహిళ కార్మికులపై ప్రభుత్వ వైఖరి సరిగా లేదని విమర్శించారు. ప్రశ్నించే గొంతును నొక్కు ప్రయత్నం చేస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దాలి

- పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్



నాటుసారా తయారీదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నాటుసారా తయారీదారులకు, విక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు నాటుసారా తయారీదారులు, విక్రయదారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించాయని, కానీ ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపుతూ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. ఎక్సైజ్, రెవెన్యూ, పోలీస్, అగ్రికల్చర్, విద్యుత్ శాఖలు సమన్వయంగా నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం గ్రామాల్లో పలుమార్లు దాడులు జరిపిన భయం లేకుండా గుడుంబా తయారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్క కుటుంబం బతికేందుకు 100 మందిని చంపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. యువకులు నాటుసారాకు బానిసవడంతో 35 ఏళ్లకే తనువు చాలిస్తున్నారని, దీంతో యువతులు వితంతువులుగా మారుతున్నారని అన్నారు. ఆధార్ కంప్యూటరైజేషన్ చేయడంతో నాటుసారా తయారీదారులు, విక్రయదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని అన్నారు. అయితే గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నారని, విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టుషాపులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మహిళలు ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి తమకు ఆదేశాలు రాలేదని ఏసీపీ బదులిచ్చారు. అనంతరం నాటుసారా తయారీదారులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు సులోచన, జ్యోతి, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఆర్ఐ శరత్‌కుమార్, ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు కళ్లల్లో 'రుణమాఫీ' ఆనందం

ఆత్మకూరు : రైతు రుణమాఫీతో రైతుల కళ్లలో ఆనందం చూస్తున్నామని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అలాగే రైతులకు రుణమాఫీ హర్షణీయమని సొసైటీ చైర్మన్ రవీందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు లక్ష యాభై వేల వరకు రుణమాఫీ చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



తహసీల్దార్ సుభాషిణికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించిన తెలంగాణ ఉద్యమకారులకు ప్రతీ నెల రూ. 25 వేల గౌరవ వేతనం, 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామనే హామీని వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాషిణికి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో 2001 నుంచి 2014 వరకు అనేక పోరాటాలు చేసి కేసులపాలై ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతీనెల రూ. 25 వేల గౌరవ వేతనం, 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని వెంటనే కేటాయించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులు కొమ్ముల శివ, నమితబాజీ అశోక్, గిద్దమారి సురేశ్, వనం దేవరాజు, రాజ్‌మహ్మద్, రఫీ, మహేందర్‌రెడ్డి, మాధర్, నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రాజన్న

వేలేరు : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు మెళకువలు పాటించాలని వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక స్థితిని పరీక్షించి విద్య బోధన చేయాలన్నారు. దీనికి అనుగుణంగా ఉపాధ్యాయులు మెళకువలకు పాటించి పాఠాలు బోధించాలని సూచించారు. ఎర్రబెల్లి ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, రీసోర్స్ పర్సన్స్ సుజాత, మహేశ్వర్, ప్రవీణ్, కొరుకెల్లి పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి



నల్లబెల్లి : మండల కేంద్రంలో మంగళవారం క్షుద్ర పూజల కలకలం చోటు చేసుకుంది. హైస్కూల్‌లోని హెచ్‌ఎం కార్యాలయం ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, నిమ్మకాలు, కొబ్బరి కాయలు వేశారు. మొదటి అంతస్తులో మద్యం సేవించి బాటిళ్లను పడేశారు. ఉపాధ్యాయులు సమాచారం అందించడంతో ఎస్సై ప్రశాంత్ బాబు పాఠశాలకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. మద్యం మత్తులో ఆగంతకులు దుశ్చర్యకు పాల్పడి ఉంటారన్న అభిప్రాయం వెల్లడైంది. అనంతరం ఎస్సై విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్నఎస్సై శ్రీనివాస్

ఐనవోలు : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై పస్తం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సింగారం ప్రభుత్వ పాఠశాలలో డ్రగ్స్ అలవాటు, డ్రగ్స్ అమ్మకం, నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. సిగరెట్, గుట్కా, అంబర్, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలో చదివే 85 మంది విద్యార్థులకు దాత చెలిపూరి దేవేందర్‌రెడ్డి విరాళంగా అందించిన టై, బెల్టులు, డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ అధ్యక్షురాలు ఖాతా వెంకటమ్మ, రిటైర్డ్ ఎస్సై విజయ్‌పాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు హరిగోపాల్, ఫాతిమా, రామకృష్ణారెడ్డి, ప్రశాంత్, మమత పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

నర్సంపేట రూరల్ : మండలంలోని నర్సంపేట, లక్నేపల్లి, గురిజాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శానా ఉమామహేశ్వర్, మండల మండల అధ్యక్షుడు పోరెడ్డి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కోడం సాంబయ్య, మండల అసోసియేట్ అధ్యక్షుడు లక్పతి, మండల కార్యదర్శి శీలం మల్లయ్య, జిల్లా కార్యదర్శి నాగేందర్‌సింగ్, పాల్గొన్నారు.

బురదమయం.. అధికారుల నిర్లక్ష్యం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బురద



కుంటను తలపిస్తున్న నాచినపల్లిలోని రోడ్డు

దుగ్గొండి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రహదారులు బురదమయం అయ్యాయి. తహసీల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనూ నీరు నిలిచి బురదమయం కాగా కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాగా బురదమయం అయిన ప్రాంతాల్లో మట్టి పోయించడం, వర్షపు నీరు నిల్వకుండా చూడడం లాంటి పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బురదతో వరి పొలాన్ని తలపిస్తోంది. కార్యాలయంలోకి వెళ్లాలంటే చెప్పులు చేత పట్టుకోవాల్సి వస్తోందని ప్రజలు, రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం ఎదుట కూడా శుభ్రం చేసుకోకపోతే ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక నాచినపల్లిలోని మినీ బ్యాంక్ వద్ద 100 మీటర్ల మేర వర్షపునీటితో నిండి రహదారి చిన్ననాటి కుంటను తలపిస్తోంది. మోకాలి లోతు నీటిలో రాకపోకలు సాగించడం దుర్భరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలో కార్యాలయాల ఆవరణల్లో, గ్రామాల్లోని రహదారుల్లో బురదమయం కాకుండా, వర్షపు నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా

ఓపెన్ డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ (పరకాల) : 2024-25 విద్యాసంవత్సరానికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోష్‌కుమార్, లర్నింగ్ సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 18 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని కోరారు. పూర్తి వివరాలకు సెంటర్ కోఆర్డినేటర్ 7382929713 నంబర్‌కు సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



సంపత్(ఫైల్)

ఐనవోలు : పొలంలో పని చేస్తున్న రైతు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డోబీల సంపత్(55) తన పొలంలో వడ్లు పెడుతుండగా ఉన్నపలంగా కిందపడిపోయాడు. దీంతో సమీపంలోని రైతులు వచ్చి చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు వేణు ఉన్నారు.

కూరగాయల మార్కెట్‌కు నేడు వేలం

కమలాపూర్ : మండల కేంద్రంలోని గుడిబండ వద్ద రోజువారీగా నిర్వహించే కూరగాయల మార్కెట్‌కు 2024-25 సంవత్సరానికి గాను (ఆగస్టు 1 నుంచి 2025 మార్చి 31 వరకు) బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి గుండె బాబు, ఈఓ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్‌తో పాటు రూ.250 షెడ్యూల్ క్యాస్ట్ ధర చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలం దక్కించుకున్న వారు గ్రామపంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారం ఫీజులు వసూలు చేయాల్సి ఉంటుందని వారు తెలిపారు.

అలరించిన ఆవిష్కార్



దామెర : ఆల్ఫోర్స్ కళాశాలలో నిర్వహించిన ఆవిష్కార్ - 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నగరంలోని 4 బ్రాంచీల ఆల్ఫోర్స్ కళాశాలలో చేరిన నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆవిష్కార్ మంచి వేదిక అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణవాడ కష్టాలు తీర్చండి



హన్మకొండ (పరకాల) : అస్తవ్యస్తమైన డ్రైనేజీతో పరకాల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలో వెళ్లాల్సిన వరదనీరు ఇళ్లలోకి చేరుతుండగా కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పరకాల పట్టణంలోని బ్రాహ్మణవాడ ప్రజల బాధలు మరింత ఎక్కువే. దీంతో కాలనీవాసులు డీజిల్ మోటర్లను అద్దెకు తెచ్చుకుని ఇళ్లలోకి వచ్చిన వరదనీటిని రోడ్డుపైకి పంపింగ్ చేస్తూ బయటికి పంపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలభద్ర భవాని కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి ఉన్నారు.

'ముదిరాజ్'లపై రాజకీయ పార్టీల నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

దుగ్గొండి : ముదిరాజ్ కులస్తుల పట్ల రాజకీయ పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ తెలిపారు. జనాభా పరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయ, ఇతర అవకాశాలు సరైన రీతిలో కల్పించడం లేదని ఆయన చెప్పారు. ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిరసనా ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో ముదిరాజ్ కులస్తులు 13 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్ కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. శాసనసభ, పార్లమెంట్, రాజ్యసభతోపాటు నామినేటెడ్ పదవుల్లోనూ రాజకీయ పార్టీలూ సరైన వాటా ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల అన్ని సమస్యలనూ సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు మొగిలి తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇల్లు కట్టించాలి



చెన్నారావుపేట : మండలంలోని అమీన్‌పేట శివారులోని పనికర గుట్ట సమీపంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి ఇల్లు కట్టించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అక్కలపెల్లి రమేశ్, మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎస్సై గూడ అరుణ అక్కడకు చేరుకుని గుడిసెవాసులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గుడిసెలు వేసుకుని ఏడేళ్లుగా నివాసం ఉంటున్నట్లు రమేశ్, చెన్నకేశవులు తెలిపారు.